సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 20 । డిసెంబర్ । 2023



ముందస్తు క్రిస్మస్ వేడుకలు

పెద్దపల్లిరూరల్: ట్రాన్స్‌కో ఎస్‌ఈ బొంకూరి సుదర్శన్ ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.



సుల్తాన్‌పూర్ సందర్శన

ఎలిగేడు: సుల్తాన్‌పూర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను తమిళనాడులోని అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
33.0/24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉదయం.

న్యూస్‌రీల్

సవరణలు చేయండి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో సవరణలు చేయాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ గణేశ్, ఇన్‌చార్జి బచ్చలి ఆమని కోరారు. ఈమేరకు మంగళవారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి జిల్లా కేంద్రంలో వినతిపత్రం సమర్పించారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన వారికే పథకం వర్తింపజేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు ఉచిత రవాణా సౌకర్యం అమలు సరికాదన్నారు. ఆర్థికంగా ఉన్నవారికి ప్రయోజనం కలిగించి ప్రజాధనం వృథా చేయొద్దని కోరారు. మరోవైపు.. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆటోవాలాల ఉపాధికి గండిపడిందని, వారిని ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, శంకరయ్య, రాజయ్య, మనోజ్, రాజు, సందీప్ పాల్గొన్నారు.

మిల్లుల్లో పత్తి కొనుగోలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): జిల్లాలోని పలు కాటన్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లకు అవకాశం ఇస్తూ వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి ఈనెల 5న ఉత్తర్వులు జారీచేశారు. మార్కెట్లు, సీసీఐ సెంటర్లు, కాటన్ మిల్లుల్లో రైతుల నుంచి మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఏఎంసీ ఆపరేటర్ అందుబాటులో ఉండి రైతుల వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు.

నియామకం



దేవేందర్

సుల్తానాబాద్(పెద్దపల్లి): గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు లింగంపల్లి దేవేందర్ నియామకమయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రతినిధుల సంఘం ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

పత్తి ధర రూ.6,621

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పత్తి ధర క్వింటాలుకు గరిష్ఠంగా రూ.6,621 పలికింది. కనిష్ఠ ధర రూ.5,811, సరాసరి ధర రూ.6,531గా నిర్ణయించినట్లు మార్కెట్ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



బహుమతులు అందిస్తున్న యోగేశ్ పర్మార్

జ్యోతినగర్(రామగుండం): క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సింగరేణి సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఎస్‌టీపీపీ) సీఐఎస్‌ఎఫ్ కమాండెంట్ యోగేశ్ పర్మార్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయంలో వార్షిక క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కోవాలని సూచించారు. విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. క్రీడాపోటీల్లో విజేతలైన వారికి బహుమతులు, ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మార్కండేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ పొందాలి

కోల్‌సిటీ(రామగుండం): వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ రుసుం సకాలంలో చెల్లించాలని, కొత్త వారు లైసెన్స్ తీసుకుని తమతో సహకరించాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్ కోరారు. గడువులోగా ఫీజు చెల్లించనివారికి జరిమానా విధిస్తామని కార్పొరేషన్ కమిషనర్ తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో ఇంటర్, ఆపై చదువులు చదివే అర్హులైన ఎస్సీ విద్యార్థులు ప్రస్తుత విద్యాసంవత్సరంలో పోస్టుమెట్రిక్(రెన్యూవల్, ప్రెష్) స్కాలర్‌షిప్‌ల కోసం ఈనెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్‌కులాల అభివృద్ధి అధికారి నాగలేశ్వర్ కోరారు. ఈమేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

పెద్దపల్లిరూరల్: యువజనోత్సవాల సందర్భంగా ఈనెల 29న స్థానిక అమర్‌చంద్ కల్యాణ మండపంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి, అర్హత గల 15 నుంచి 29ఏళ్లలోపు వయసుగల కళాకారులు ఈనెల 22లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సురేశ్ కోరారు. మరన్ని వివరాల కోసం 94401 67222 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

అమ్మా.. ఆరోగ్యం ఎలా ఉంది?

- క్షేత్రస్థాయిలో వైద్యవిద్యార్థులు
- ఒక్కొక్కరు ఐదు కుటుంబాల దత్తత
- ఆరోగ్య, ఆర్థిక, ఇతర సమస్యలపై వివరాలు సేకరణ
- చదువుతోపాటు ప్రజలకూ అనేక ప్రయోజనాలు

మంథని: కళాశాలల్లోని తరగతి గదులకే పరిమితమైన వైద్యవిద్య ఇప్పుడు క్షేత్రస్థాయిలోకి వెళ్లింది. అంతేకాదు.. ల్యాబ్‌ల్లో ప్రాక్టికల్స్ వరకే సాగిన మెడికోల చదువు ఇప్పుడు ప్రజల వద్దకు చేరుకుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా, విప్లవాత్మక మార్పులతో చోటుచేసుకుంటున్న పరిస్థితులకు పెద్దపీట వేస్తూ వైద్యవిద్యార్థులు తమ చదువుల్లోనూ మార్పులు చేసుకుంటున్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ రూపొందించిన మార్గదర్శకాల నేపథ్యంలో నిపుణులైన వైద్యులను సమాజానికి అందించడం లక్ష్యంగా అధ్యాపకులూ వారితో కలిసి క్షేత్రస్థాయికి వెళ్తున్నారు. ప్రజల ఆరోగ్యం, ఇతర అంశాలపై సవివరాలూ సేకరిస్తున్నారు. రామగుండంలోని సింగరేణి మెడికల్ సైన్సెస్(సిమ్స్) మెడికోలు కూడా ఈ కోవలోనే జిల్లాలోని పలు గ్రామాలకు చేరుకున్నారు. ఒక్కొక్కరు ఐదు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. వారి ఆరోగ్యం, ఆర్థికం, ఇతర అంశాలపై సర్వే చేస్తున్నారు.

బోధనతో సమాంతరంగా..

- ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో చేరింది మొదలు ఐదేళ్లపాటు ఐదు కుటుంబాలను మెడికోలు దత్తత తీసుకోవాలి.
- దత్తత కుటుంబాలతో కలిసి బోధన, అభ్యసన విషయాలకు సమాంతరంగా వివిధ అంశాలు పరిశీలించాలి.
- ఇందు కోసం రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీ నుంచి రూరల్ హెల్త్ ట్రెనింగ్ సెంటర్, అర్బన్ హెల్త్ ట్రేనింగ్ సెంటర్ గుర్తించారు.



హెల్త్ సర్వే చేస్తున్న వైద్యవిద్యార్థులు

- రూరల్ ప్రాంతం నుంచి కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ నుంచి రామగుండంలోని అడ్డగుంటపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంచుకున్నారు.
- కళాశాలలోని 150 మంది మెడికోలు ఐదేసీ కుటుంబాల ఆర్థిక పరిస్థితి, ఆహారపు అలవాట్లు, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగం, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, పిల్లలు, వృద్ధులు, వ్యాధులు, టీకాలు.. ఇలా ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక తయారు చేస్తున్నారు.
- తరగతి గదిలో నేర్చుకున్న అంశాలపై దత్తత కుటుంబాలపై ప్రాక్టికల్స్ చేస్తున్నారు.
- ఇలా గుర్తించిన అంశాలపై నివేదిక రూపంలో అధ్యాపకులకు అందించాలి.
- తద్వారా ద్వితీయ సంవత్సరం నుంచి ఆస్పత్రిలో వైద్య సేవలు అందించాలి.
- ఇందుకోసం క్షేత్రస్థాయిలో చేసుకున్న అవగాహన ఎంతోదోహదం పడుతుందని అధ్యాపకులు చెబుతున్నారు.
- ఇదేసమయంలో గ్రామీణులకూ ప్రయోజనం కలుగుతుందని వారు అంటున్నారు.

ఎంతోప్రయోజనం



మేము వైద్యవిద్య అభ్యసించే సమయంలో ఐదు కుటుంబాలను దత్తత తీసుకునే అవకాశం లేదు. ఇప్పుడు నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆ అవకాశం కల్పించింది. మెడికోలు క్షేత్రస్థాయికి వెళ్లి దత్తత తీసుకున్న వారి ఆరోగ్య వివరాలు తెలుసుకోవడం ద్వారా ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రజలకూ మేలు చేకూరుతుంది.

– హిమబిందు, ప్రిన్సిపాల్, సిమ్స్,రామగుండం

ప్రొఫెసర్ల పర్యవేక్షణలో..



అవగాహన కల్పిస్తున్న మెడికోలు, ప్రొఫెసర్లు

- ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో 10 నుంచి 15 మంది వైద్య విద్యార్థులను ఒక బృందంగా ఏర్పాటు చేశారు.
- అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో స్థానిక వైద్యసిబ్బంది సాయంతో మెడికోలు క్షేత్రస్థాయిలో దత్తత కుటుంబాల ఆరోగ్యం, ఇతర అంశాలపై పరిశీలన చేస్తున్నారు.
- జనాలకు వద్ద నేరుగా వెళ్లి అన్ని వివరాలూ సేకరిస్తున్నారు.
- ఐదేళ్లపాటు కొనసాగే క్షేత్రస్థాయి హెల్త్‌సర్వేపై పూర్తిస్థాయి నివేదక రూపొందిస్తారు.
- ఇందుకోసం ప్రత్యేకంగా వీరికి గ్రేడ్స్ కేటాయించనున్నారు.
- అంతేకాదు.. గ్రామీణ, అర్బన్ ప్రాంత ప్రజలకు నేరుగా మెరుగైన వైద్య సేవలు అందడంతోపాటు ఆరోగ్య తదితర అంశాలపై అవగాహన కలుగుతుంది.

వైద్యసేవలు మెరుగు..

గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం తరగతులు ఈ ఏడాదే ప్రారంభమయ్యాయి. కళాశాలలో మొత్తం 150 మంది విద్యార్థులు వైద్య విద్య అభ్యసిస్తున్నారు. నిబంధనల ప్రకారం వారు 750 కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని వారి ఆరోగ్యంపై అవగాహన పెంచుకుంటున్నారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయితో పోల్చుకొని ఓ నిర్ధారణకు వస్తే.. భవిష్యత్‌లో అందించే వైద్య సేవలు తమకు సులభంగా ఉంటాయని అభిప్రాయపడుతున్నారు. వైద్య విద్యార్థులు నేరుగా గ్రామాల్లోకి వెళ్లడం, వైద్య సలహాలు ఇవ్వడం, తెలియని విషయాల గురించి అడిగితే సీనియర్ల సలహాలతో దత్తత కుటుంబాలకు సేవలు అందించడం ద్వారా ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

అవిశ్వాసం దిశగా కార్పొరేటర్ల అడుగులు?

- హాట్‌టాపిక్‌గా మారిన రామగుండం బల్దియా రాజకీయం
- ఏకాభిప్రాయం కోసం ఏకమవుతున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు
- నేడు మరోసారి సమావేశమయ్యే అవకాశం!



సమావేశమైన కార్పొరేటర్లు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ రాజకీయం హాట్‌టాపిక్‌గా మారింది. సొంతపార్టీ(బీఆర్‌ఎస్)లోని విభేదాలతో అవిశ్వాసం ముప్పు ముంచుకొస్తుందనే ప్రచారం సాగుతోంది. మంగళవారం 23 మందికిపైగా కార్పొరేటర్ల బల్దియా కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశం కావడం చర్చనీయాంశంగా మారింది. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడం కోసమే వారు సమావేశమైనట్లు తెలుస్తోంది. చర్చకు వచ్చిన అంశాలు వెల్లడించని కార్పొరేటర్లు.. ఏకాభిప్రాయం కోసం బుధవారం మరోసారి సమావేశమవుతామన్నారు. సొంత పార్టీ కార్పొరేటర్లు కొందరు కాంగ్రెస్‌లో చేరేందుకు సమాలోచనలు చేస్తున్నారని వస్తున్న ఆరోపణలను ఖండించారు. సొంత పార్టీ కార్పొరేటర్లే మేయర్, డిప్యూటీ మేయర్‌ను గద్దె దింపేందుకు కసరత్తు చేస్తున్నట్లు కొందరు లీకులిస్తున్నారు. ఇటీవల ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేతో నిర్వహించిన సమీక్షపై కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వలేదని, మేయర్ ఒక్కరే ఎమ్మెల్యేను కలుసుకుంటున్నారని సొంత పార్టీ కార్పొరేటర్లు వాపోతున్నారు. ఇదిలా ఉంటే.. మేయర్ ఎన్నిక సందర్భంగా కార్పొరేటర్లకు నగదు చెల్లింపులు ఇవ్వాలని తీసుకున్న ఒప్పందంతోపాటు సాధారణ ఎన్నికల్లో కూడా కార్పొరేటర్లకు డబ్బు చెల్లింపులు పూర్తిస్థాయిలో సంతృప్తి పర్చలేదని బహిరంగంగానే ఆరోపించడం చర్చనీయాంశంగా మారింది.

'కేశోరాం'లో కాంట్రాక్టు కార్మికుల ఆందోళన



సిమెంటు పరిశ్రమ గేట్ ఎదుట బైఠాయించిన కాంట్రాక్టు కార్మికులు, నాయకులు

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలోని కాంట్రాక్టు మంగళవారం ప్రధాన ద్వారం ఎదుట ఆందోళన నిర్వహించారు. కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి కాల్వ అంజయ్య ఆధ్వర్యంలో ఉదయం విధులు బహిష్కరించారు. మధ్యాహ్నం 2గంటల వరకు కార్మికులు బైఠాయించారు. రెండేళ్లుగా కార్మికులకు పదోన్నతులు రావడం లేదని, రేట్లు పెంచడం లేదని, అలవెన్స్‌లు చెల్లించడం లేదని ఆరోపించారు. తమ సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. డిమాండ్లు అమలు చేసేవరకూ ఆందోళనలు కొనసాగిస్తామని కార్మికులు, నాయకులు భీష్మించుకుని కూర్చున్నారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి సీఐ అనిల్‌కుమార్ పోలీసు సిబ్బందితో వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బందోబస్తు చేపట్టారు. అయితే, మధ్యాహ్నం అధికారులతో నాయకులు చర్చించినా ఫలితం లేకుండా పోయింది. చివరకు కంపెనీ మేనేజర్ గోవిందరావు.. ఈనెల 21న మరోసారి చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ మేరకు కార్మికులు ఆందోళన విరమించారు. నాయకులు తాండ్ర సదానందం, గంగాధర రమేశ్, పాత రవీందర్, దాడి పోశమల్లు, కార్మికులు పాల్గొన్నారు.

తెరపైకి మళ్లీ స్క్రాప్ చోరీ కేసు!

కోల్‌సిటీ(రామగుండం): మున్సిపల్ కార్పొరేషన్‌లో రెండేళ్ల క్రితం మాయమైన స్క్రాప్ చోరీకేసు మళ్లీ తెరపైకి వచ్చింది. పాత మున్సిపల్ కార్యాలయంలో చోరీకి గురైన స్క్రాప్ ఘటనపై అప్పటి వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంతకాలం ఈ కేసు విషయంపై బల్దియా అధికారులు ఎవరు కూడా ఆరా తీయలేదు. మంగళవారం బల్దియా కమిషనర్ నాగేశ్వర్ సీఐకి లేఖ రాయడంతో స్క్రాప్ చోరీ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. మాయమైన విలువైన స్క్రాప్ రికవరీ అయ్యిందా? నిందితులను గుర్తించారా? తదితర వివరాలను తెలియజేయాలని పోలీసులకు పంపించిన లేఖలో కమిషనర్ కోరారు.

స్థానికులకే ఉద్యోగావకాశాలు

- తల్లిదండ్రుల సాక్షిగా చెబుతున్నా.. మీకు రక్షకుడిగా ఉంటా
- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

జ్యోతినగర్(రామగుండం): నియోజకవర్గంలోని వివిధ పరిశ్రమల్లోని కొలువులు ఈప్రాంతవాసులకు చెందేవరకూ తగ్గేదిలేదని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. ఎన్టీపీసీ లేబర్ గేట్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాంట్‌లోని ఉద్యోగాల్లో స్థానికేతరులను నియమించడంలో జరిగిన కుంభకోణంపై విచారణ జరిపిస్తామని తెలిపారు. పేదలకు ఇళ్లపట్టాలు ఇప్పిస్తానని, ఎన్టీపీసీ సమీపంలోని గుట్టపై ఇళ్లు కట్టిస్తానని తెలిపారు. త్వరలోనే ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ప్రజా దర్బార్ నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఈఎస్‌ఐ ఆస్పత్రి సందర్శించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.2కోట్లు వెచ్చించి తాగునీటి పైపులైన్ నిర్మిస్తున్నామన్నారు. ఆ తర్వాత 24వ డివిజన్ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు పనులను కార్పొరేటర్ కొలిపాక సుజాతతో కలిసి పరిశీలించారు. నగర మేయర్ అనిల్‌కుమార్, కమిషనర్ నాగేశ్వర్, అధికారులు చిన్నారావు, జమీల్, కార్పొరేటర్లు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

శిక్షణతో ఉపాధి అవకాశాలు



గోదావరిఖని: స్వయం ఉపాధి శిక్షణలో రాణించాలని ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ సూచించారు. స్వయం ఉపాధి శిక్షణ కోర్సులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ప్రతీఒక్కరు ఫ్యాషన్, డిజైన్ కోర్సులు ఎంచుకుంటున్నారని తెలిపారు. కుట్లు, అల్లికలు, మగ్గం వర్క్‌పై ఆసక్తి చూపుతున్నారని అన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునికీకరిస్తాం

- పెద్దపల్లిలో 250 పడకలు అందుబాటులోకి తెస్తాం
- ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: 'జిల్లా ప్రజల మన్ననలు పొందేలా మెరుగైన వైద్య సేవలు అందించాలి.. అందుకు అనుగుణంగా ఆస్పత్రుల్లో వసతులు కల్పిస్తాం.. జిల్లా ఆస్పత్రిలో పడకలను 250కి పెంచుతాం' అని ఎమెల్యే విజయరమణారావు అన్నారు. ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ వాసుదేవరెడ్డి, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్ రమాకాంత్ తదితర వైద్యాధికారులతో జిల్లా కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. పలు అంశాలపై సమీక్షించారు. పేషెంట్లకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ప్రతీఒక్కరు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ఇన్‌పేషెంట్లకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. సుల్తానాబాద్‌లో 50, కాల్వశ్రీరాంపూర్, పాత్కపల్లిలో 30 చొప్పన పడకలు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఫార్మసీ కౌన్సిల్ కొత్త క్యాలెండర్ ఆవిష్కరించారు. రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడు, జిల్లా డ్రగ్గిస్ట్, కెమిస్ట్ అధ్యక్షుడు మాడూరి వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే సహించేది లేదు

వివిధ పనుల కోసం బల్దియాకు వచ్చే ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా, పారదర్శకంగా ఇంటి నిర్మాణాలకు అనుమతులను ఇవ్వాలని, అవినీతికి పాల్పడితే సహించేదీ లేదని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్ తదితరులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. పట్టణంలో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. తాగునీటి సరఫరా మెరుగ్గా ఉండేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అధికారులు

మార్పులు.. చేర్పులు

- కసరత్తు ముమ్మరం చేసిన అధికారులు
- జిల్లాలో 267 పంచాయతీలు.. 2,476 వార్డులు
- జనవరిలో ముగియనున్న పాలకవర్గాల పదవీకాలం
- ఎన్నికల నిర్వహణకు సర్వసన్నద్ధమైన అధికార యంత్రాంగం

పెద్దపల్లిరూరల్: గ్రామ పంచాయతీ పాలక మండలి గడువు వచ్చే ఏడాది జనవరి నెలాఖరుతో ముగియనుంది. దీంతో ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికల నగరా మోగించినా.. అందుకు సర్వసన్నద్ధంగా ఉండేందుకు అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. జిల్లాలోని 13(రామగుండం మినహా) మండలాల్లో 267 గ్రామ పంచాయతీలు, 2,467 వార్డులు ఉన్నాయి. ఎన్నికల సమయం నాటికి ఈసారి కొత్తగా కొన్ని పంచాయతీల ఏర్పాటు, వార్డుల వివరాల్లో కొన్ని మార్పులు, చేర్పులు జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు వివరిస్తున్నారు.

రిజర్వేషన్ల సంగతేంటో..!

- గత ప్రభుత్వం రూపొందించిన పంచాయతీ చట్టం ప్రకారమే రిజర్వేషన్లు అమలవుతాయా, లేక సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రిజర్వేషన్ల ప్రక్రియ చేపడుతుందా? అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉందని అధికారులు వివరిస్తున్నారు.



పంచాయతీల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఏర్పాట్లు ముమ్మరం..

- గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు సమీపిస్తోంది. దీంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. సర్కారు నుంచి ఆదేశాలు రాగానే అమలు చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే పోలింగ్ అధికారులు, సిబ్బంది జాబితా సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు. ఎన్నికల విధులు నిర్వహించేందుకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుంటున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితా కూడా వారు రూపొందిస్తున్నారు.


జనవరి 1 వరకు ఓటరు నమోదు..

పంచాయతీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించేందుకు 2024 జనవరి 1వ తేదీ వరకు 18ఏళ్ల వయసు నిండిన వారు తమపేర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. గత ఎన్నికల్లో 3,57,556 మంది ఓటర్లుండగా ఈసారి వారి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. జనవరి 6న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని అధికారులు ప్రకటించారు. ఆ జాబితాపై అభ్యంతరాలను 22 వరకు స్వీకరించి ఫిబ్రవరి 2 నాటికి పరిష్కరిస్తారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,450 మంది ఓటర్లకు మించకుండా పునర్‌వ్యవస్థీకరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

బ్యాలెట్ బాక్సులు సిద్ధం..

జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం 3,843 బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. అందులో 374 బాక్సులు పనిరావని అధికారులు గుర్తించారు. పెద్దపల్లి శివారు బందంపల్లిలోని పాఠశాల, సుల్తానాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో మిగతా బ్యాలెట్ బాక్సులను పరిశీలించి అవసరమైన వాటికి మరమ్మతులు చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఎన్నికలకు సిద్ధం



గ్రామ పంచాయతీ పాలకుల గడువు సమీపిస్తోంది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వగానే ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నాం. అధికారులు, సిబ్బంది జాబితా, బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేస్తున్నాం. మిగతా ఏర్పాట్లలో అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు.

–చంద్రమౌళి, డీపీవో, పెద్దపల్లి

పంచాయతీలు, వార్డుల వివరాలు

మండలం	పంచాయతీలు	వార్డులు
అంతర్గాం	16	144
ధర్మారం	29	266
ఎలిగేడు	12	114
జూలపల్లి	13	130
కమాన్‌పూర్	9	92
మంథని	34	276
ముత్తారం	14	134
ఓదెల	22	198
పాలకుర్తి	20	186
పెద్దపల్లి	30	294
రామగిరి	17	170
శ్రీరాంపూర్	24	226
సుల్తానాబాద్	27	246
మొత్తం	267	2,476

క్లుప్తంగా

బావిలో పడ్డ ట్రాక్టర్

- తప్పిన పెను ప్రమాదం



క్రేన్ సహాయంతో బావిలోంచి తీస్తున్న ట్రాక్టర్

రాయికల్: మండలంలోని బోర్నపల్లి శివారులో ఓ ట్రాక్టర్ బావిలో పడింది. ఎవరికి ఏమీ కాక పోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. గ్రామానికి చెందిన ఓ యజమాని ట్రాక్టర్‌పై భీంరావు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఓ రైతు ధాన్యం తెచ్చుకునేందుకు ట్రాక్టర్‌ను అద్దెకు మాట్లాడుకున్నాడు. డ్రైవర్ ట్రాక్టర్‌ను తీసుకెళ్లి.. ట్రాలీని వదిలి ఇంటికొస్తుండగా అజాగ్రత్తగా నడపడంతో అదుపుతప్పి వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. అప్రమత్తమైన భీంరావు ట్రాక్టర్‌పైనుంచి దూకి ప్రాణాలు రక్షించుకున్నాడు. బావిలో పడిన ట్రాక్టర్‌ను భారీ క్రేన్ సహాయంతో బయటకు తీశారు.

పలువురిపై పిచ్చికుక్క దాడి



ఎలిగేడు(పెద్దపల్లి): ధూళికట్ట గ్రామంలో పిచ్చికుక్క మంగళవారం పలువురిపై దాడిచేసింది. రోడ్డు వెంట పరుగెడుతూ కనిపించిన వారిని కరిచింది. ఇందులో జక్కుల భూమయ్య, దాసరి మల్లయ్య, అనిత, కిషన్‌రావు, లస్మయ్య, సంపత్, తిరుపతి, మరికొందరు గాయాల పాలయ్యారు. కనిపించిన వారిపై పిచ్చికుక్క దాడిచేయడంతో స్థానికులు పరుగులు పెట్టారు. బాధితులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గోదావరిఖని లూర్థునగర్‌కు చెందిన మారంరెడ్డి ఇన్నారెడ్డి తన ద్విచక్ర వాహనంపై ప్లాంట్ రోడ్డు మీదుగా లూర్థునగర్ వెళ్తున్నాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఇన్నారెడ్డి కిందపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ప్రాజెక్టు ఏజీఎం(హెచ్ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్.. గాయపడిన వ్యక్తిని 108 వాహనం ద్వారా గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బ్యాంకు ఖాతాలోంచి డబ్బులు మాయం

పెద్దపల్లిరూరల్: బ్యాంకులో దాచుకున్న డబ్బు ఖాతాదారులకు తెలియకుండానే సైబర్‌నేరగాళ్లు కాజేస్తున్నారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించి తమ గోడువెళ్లబోసుకుంటున్నారు. ఈక్రమంలో పట్టణంలోని పలు ప్రాంతాలు, పెద్దకల్వలకు చెందిన పలువురి బ్యాంకుఖాతాల్లోంచి డబ్బు మాయమైంది. బాధితులు మంగళవారం ఎస్సై మహేందర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఇందులో పెద్దపల్లి మండలం పెద్దకల్వలకు చెందిన కల్వల వసంత, రాజేశం, బత్తిని సత్యనారాయణ తదితరులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, నగదు లావాదేవీల కోసం వేలిముద్రలు వేస్తున్నారని, ఇలాంటి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధార్, ఓటీపీ నంబర్లను ఎవరికీ చెప్పవద్దని సూచించారు.

భూ వివాదం.. రెండుశాఖలకు శాపం

- రోజురోజుకూ పెరుగుతున్న దరఖాస్తుదారులు
- ఆర్డీవో కార్యాలయానికి భారీగా తాకిడి
- పోలీసు, రెవెన్యూ శాఖలకు తలనొప్పి



నర్సింగాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో వెలిసిన గుడిసెలు

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ భూమి వివాదం అటు రెవెన్యూ, ఇటు పోలీస్ శాఖలకు తలనొప్పిగా మారింది. జగిత్యాల శివారు నర్సింగాపూర్‌లోని ప్రభుత్వ భూమిని నిరుపేదలకు ఇప్పిస్తామంటూ కొంతమంది జిల్లాతోపాటు కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల, కామారెడ్డి, పెద్దపల్లి జిల్లాలకు చెందిన పేదలను మభ్యపెట్టి ఇక్కడ తాత్కాలికంగా గుడిసెలు వేయించారు. విషయం తెలుసుకుంటున్న చుట్టుపక్కల జిల్లాల ప్రజలు భారీఎత్తున తరలివచ్చి ఇక్కడి ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. వారిని కట్టడి చేయడం రెండు శాఖలకు తలనొప్పిగా మారింది. జగిత్యాలరూరల్ మండలం నర్సింగాపూర్ శివారులోని సర్వేనంబరు 437లోగల ప్రభుత్వ భూమిలో ఎన్నికలకు ముందు కొంతమందితో గుడిసెలు వేయించారు. ఎన్నికల బిజీలో ఉన్న రెవెన్యూ, పోలీసు శాఖ చూసీచూడనట్లు వ్యవహరించాయి. ఈ క్రమంలో అక్కడ సుమారు 800వరకు గుడిసెలు వెలిశాయి. ఇదే క్రమంలో సోమవారం కూడా భూమిలేని నిరుపేదలందరికీ ప్రభుత్వ భూమిలో పట్టాలిస్తున్నారని కొందరు ప్రచారం చేయడంతో వివిధ జిల్లాల నుంచి సుమారు ఐదు వేల మంది వరకు తరలివచ్చారు. తమకు పట్టాలు ఇవ్వాల్సిందేనని జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీ తీశారు. వారంతా నర్సింగాపూర్ గ్రామానికి వెళ్లి అక్కడున్న ప్రభుత్వ భూమిలో చీరలతో తాత్కాలికంగా గుడిసెలు ఏర్పాటు చేసుకుంటున్నారు. గుడిసెలు వేసుకునేలా ప్రోత్సహించిన ఏడుగురిపై గతంలోనే రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే వారిని పోలీసులు అదుపులోకి తీసుకోకపోవడంతో వారే తాజాగా పేదలను ఇక్కడికి రప్పించి అక్రమంగా గుడిసెలు వేసేలా ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

భారీగా దరఖాస్తులు

నర్సింగాపూర్ శివారులో ప్రభుత్వ భూమికి పట్టాలిస్తున్నారని ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి మంగళవారం కూడా భారీగా మహిళలు వచ్చి దరఖాస్తులను జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో సమర్పించారు. మరోవైపు నర్సింగాపూర్‌లోని ప్రభుత్వ భూమిలో గత ప్రభుత్వం కొన్ని కులసంఘాలకు పట్టాలు ఇచ్చింది. దీంతో వారు ఆ ప్రాంతాన్ని చదును చేసి హద్దులు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు వివిధ జిల్లాల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చి గుడిసెలు, తాత్కాలిక గుడారాలు వేస్తుండటంతో పట్టాలు తీసుకున్న కుల సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. వారు కూడా మోకాపైకి వస్తే రెండువర్గాల మధ్య ఘర్షణలు జరిగే పరిస్థితి నెలకొంది.

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు

40 రోజులుగా రోజుకు కొంతమంది ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేస్తున్నా రెవెన్యూ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోకుండా ఎన్నికల విధుల పేరుతో కాలం వెళ్లదీశారు. ప్రస్తుతం గుడిసెల సంఖ్య సుమారు 800లకు చేరుకోవడంతో రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులుపుకున్నారు.

ఆగిన ఆటోడ్రైవర్ ఊపిరి



సతీశ్ (ఫైల్)



విలపిస్తున్న భార్య, పిల్లలు, కుటుంబీకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): కిరాయిలు రావడం లేదని.. ఆందోళనకు గురైన ఓ ఆటోడ్రైవర్ గుండె ఆగిపోయింది. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు. మండలంలోని కొండాపూర్‌కు చెందిన ఆటోడ్రైవర్ గూడెపు సతీశ్(37) మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఉదయమే ఆటో నడిపేందుకు సిద్ధమవుతున్న సతీశ్ ఒక్కసారిగా గుండెలో నొప్పితో కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబీకులు ఆస్పత్రికి తరలించేలోపే ప్రాణాలు కోల్పోయాడు. సతీశ్ పదేళ్లుగా ముస్తాబాద్ నుంచి సిరిసిల్లకు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఉచిత ఆర్టీసీ బస్ ప్రయాణం పెట్టారని, గిరాకీ తగ్గిందని సతీష్ ఆందోళనకు గురయ్యాడు. దానికితోడు అప్పులు ఎలా తీర్చేదని మానసిక వేదనకు గురయ్యాడు. ముస్తాబాద్‌లో సైతం తోటి ఆటోకార్మికులతో ధర్నాలో పాల్గొన్నాడు. సతీశ్ మృతితో భార్య వనిత, కుమార్తె ప్రశస్త, కుమారుడు జశ్విన్ రోడ్డున పడ్డారు. సతీశ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆటోడ్రైవర్ యూనియన్ బాధ్యులు శంకర్‌గౌడ్, రాములు కోరారు.

కొడుకు ఆరోగ్యం కుదుటపడడం లేదని..

- ఉరేసుకుని తండ్రి ఆత్మహత్య
- డబ్బా గ్రామంలో విషాదం

ఇబ్రహీంపట్నం: కొడుకు పుట్టాడని ఆ తండ్రి ఎంతో సంతోషించాడు. అంతలోనే కొడుకు అనారోగ్యం బారిన పడడంతో తల్లడిల్లాడు. కుమారుడిని దక్కించుకునేందుకు రూ.లక్షలు ఖర్చు చేశాడు. అయినా పిల్లాడి ఆరోగ్యంలో మార్పు రాలేదు. దీంతో మనస్తాపానికి గురైన తండ్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామంలో విషాదం నింపింది. ఎస్సై ఉమాసాగర్ కథనం ప్రకారం.. మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన పొన్నం శ్రీనివాస్, హరిణి దంపతులు. వీరికి నాలుగు నెలల క్రితం కొడుకు జన్మించాడు. పుట్టిన మూడు రోజులకే అనారోగ్యం బారిన పడడంతో ఆపరేషన్ చేశారు. ఇందుకు రూ.4లక్షల వరకు ఖర్చయింది. అయినా కొడుకు ఆరోగ్యం మెరుగుపడలేదు. ఈ క్రమంలో సోమవారం హరిణి కొడుకును తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఒక్కడే ఒంటరిగా ఉన్నాడు. మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హరిణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాం

- గ్రామస్థాయి వరకూ కేంద్ర ప్రభుత్వ పథకాలు
- బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్



మాట్లాడుతున్న ఎస్.కుమార్

ధర్మారం(ధర్మపురి): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎస్.కుమార్ మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామస్థాయిలో ప్రతీవ్యక్తి వినియోగించుకోవాలని సూచించారు. మోదీ ప్రధాని అయ్యాక అనేక కఠిన నిర్ణయాలు తీసుకుని సంస్కరణలు అమలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుజ్జుల వేణుగోపాల్‌రెడ్డి, మెడవేని శ్రీనివాస్, తీగుళ్ల సతీశ్‌రెడ్డి, సందనవేని లక్ష్మణ్, ఎల్లాల మహేందర్‌రెడ్డి, కొలిపాక మణికంఠ, కొక్కుల బాలకృష్ణ, కోరె రమేశ్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షలతో తండ్రీకొడుకులపై దాడి

- 8 మందిపై హత్యాయత్నం కేసు



పెద్దపల్లిరూరల్: రాగినేడు గ్రామంలో మంగళవారం తండ్రీకొడుకులైన ఇల్లందుల వీరయ్య, పర్శరాములుపై ప్రత్యర్థులు కార్తీక్, వెంకటేశ్‌తోపాటు కొందరు కర్రలతో దాడి చేశారని ఎస్సై మహేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. దాదాపు రెండేళ్ల క్రితం జరిగిన ఓ సంఘటనకు సంబంధించి పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని ఈదాడికి దిగారు. దాడిలో వీరయ్య తలకు బలమైన గాయమైంది. అయ్యప్పదీక్షలో ఉన్న పర్శరాములుపై కూడా దాడి చేయగా.. ఆయన పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. గాయపడ్డ వారిని స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ ఘటనపై పర్శరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిదిమందిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాయికల్: మండలంలోని రాజనగర్ గ్రామానికి చెందిన గాందారి భాస్కర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈనెల 18న మండలంలోని రామాజీపేట శివారులో అల్లీపూర్‌కు చెందిన ప్రణయ్ ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండా తన బైక్‌ను అజాగ్రత్తగా నడిపి భాస్కర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో భాస్కర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమించి భాస్కర్ మృతిచెందాడు. భాస్కర్ మామ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణిని సమాధి చేయాలని చూస్తున్నారు

- ఏఐఎఫ్‌టీయూ గౌరవ అధ్యక్షురాలు విమలక్క



గోదావరిఖని: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి సంస్థను సమాధి చేయాలని చూస్తున్నాయని ఏఐఎఫ్‌టీయూ గౌరవ అధ్యక్షురాలు విమలక్క అన్నారు. మంగళవారం జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. కార్మిక వర్గ హక్కుల కోసం నిజాయితీగా పోరాడే విప్లవ సంఘాలను ఆదరించాలన్నారు. యాజమాన్యం కార్మికులు కష్టపడి సాధించిన లాభాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు నాలుగు బ్లాకులను అప్పగించాలని చూస్తోందని పేర్కొన్నారు. ఏటా కార్మికుల శ్రేయస్సు కోసం రూ.200 కోట్లను సింగరేణి కేటాయిస్తోందని అన్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికల్లో చక్రంలో సుత్తిగుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు కె.విశ్వనాథ్, ఎం.దుర్గయ్య, శేఖ ర్, మాతంగి రాయమల్లు, యాకన్న, జగదీశ్, ఎం.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రామడుగు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం



అవిశ్వాస తీర్మానం లేఖను అందిస్తున్న కాంగ్రెస్ సభ్యులు

రామడుగు: రామడుగు మండల పరిషత్ అధ్యక్షురాలు కలిగేటి కవితపై మెజారిటి ఎంపీటీసీ సభ్యులు తిరుగుబావుటా ఎగురవేశారు. మండలంలోని 14 మంది ఎంపీటీసీ సభ్యుల్లో పదిమంది బీఆర్ఎస్ చెందిన ఎంపీపీపై మంగళవారం ఆర్డీవోకు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో వాటర్ ప్లాంట్ దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవుతున్న వాటర్‌ప్లాంట్ సామగ్రి

మల్లాపూర్ : మండలంలోని మొగిలిపేటలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఘటనలో మోటార్, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ప్యాక్స్ వైస్ చైర్మన్ దూలూరి సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.

తనయుడిపై గొడ్డలితో తండ్రి దాడి

- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు



మెడపై గొడ్డలి గాయం

చందుర్తి(వేములవాడ): భూ వివాదంలో తనయుడు తరచూ గొడవ పడుతున్నాడని తండ్రి గొడ్డలితో దాడిచేసిన సంఘటన చందుర్తి మండలం తిమ్మాపూర్‌లో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన ఆవునూరి శంకర్‌కు ఐదుగురు కొడుకులు. ముగ్గురు జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లారు. మూడో కొడుకు, చిన్న కుమారుడు ఇంటి వద్ద ఉన్నారు. మూడో కొడుకు భాస్కర్, తండ్రి శంకర్ కొద్ది రోజులుగా గొడవ పడుతున్నారు. సోమవారం రాత్రి అందరూ నిద్రిస్తుండగా తండ్రి శంకర్ గొడ్డలితో తనయుడు భాస్కర్‌పై దాడి చేశాడు. గమనించిన భాస్కర్ తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడు భాస్కర్ ఫిర్యాదుతో తండ్రి శంకర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఎస్సై అశోక్ తెలిపారు. కాగా నిందితుడు శంకర్ తప్పించుకుని పారిపోయాడు.

'కేశోరామ్'ను సందర్శించిన వాగేశ్వరి విద్యార్థులు



సిమెంట్ ఫ్యాక్టరీ ఎదుట విద్యార్థులు

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 'అకాడమిక్ – ఇండస్ట్రీ ఇంటరాక్షన్' లో భాగంగా పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లోని 'కేశోరామ్ సిమెంట్స్ లిమిటెడ్' సంస్థను మంగళవారం సందర్శించారు. సిమెంట్ ఉత్పత్తి విధానాన్ని పరిశీలించారు. కంపెనీలోని వివిధ విభాగాల నిర్వహణ పద్ధతులను అధ్యయనం చేశారు. సంస్థ గురించి విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు వివరంగా వివరణ ఇచ్చారు. విద్యార్థులు క్లాస్‌రూంలో తెలుసుకున్న విషయాలను సంస్థ నిర్వహణలో విషయాలతో సరిపోల్చికొని అవగాహన చేసుకున్నారు. ప్రొడక్షన్ మేనేజర్ సదానందం, సేఫ్టీ మేనేజర్ సాయికిరణ్ విద్యార్థులకు కంపెనీ నిర్వాహణ విధానాలు వివరించారు. కళాశాల జనర్ సెక్రటరీ డా.గంద్ర శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు అన్ని మేనేజ్ మెంట్ విషయాలను ప్రాక్టికల్‌గా తెలుసుకుంటూ ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, డైరక్టర్లు విశ్వప్రకాశ్‌రెడ్డి, వినోద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్, ఎంబీఏ హెచ్‌వోడీ హరిప్రసాద్‌వర్మ, శ్రీధర్‌రెడ్డి, విజయకుమార్, అర్చన, అస్మాబేగం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బీఐఎస్‌పై అవగాహన



మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

సిరిసిల్లఎడ్యుకేషన్: సిరిసిల్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. డీఈవో రమేశ్‌కుమార్ ప్రారంభించారు. స్టాండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ అభిసాయి, బీఐఎస్ రిసోర్స్‌పర్సన్ ప్రభాకర్ బీఐఎస్ మార్కు గురించి వివరించారు. బంగారు నగలకు సంబంధించిన హాల్ మార్క్, వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన అగ్రిమార్క్ గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు స్టాండర్డ్ రైటింగ్ కాంపిటీషన్, పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. హెచ్ఎం చకినాల శ్రీనివాస, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, పాఠశాల స్టాండర్డ్స్ క్లబ్ ఇన్‌చార్జి తూముల తిరుపతి, ఉపాధ్యాయులు వడాల రవీందర్, శకుంతల, సీఆర్పీ దేవేందర్ పాల్గొన్నారు.

డీడీలు కట్టినం.. గొర్రెలు రాలే



గంభీరావుపేట(సిరిసిల్ల): బీఆర్ఎస్ ప్రభుత్వం రెండో విడతలో గొర్రెలు పంపిణీ చేస్తామంటే డీడీలు కట్టినమని.. ఆరు నెలలైనా గొర్రెలు రాలేదని మండలంలోని లింగన్నపేటలో గొల్లకుర్మలు మంగళవారం ఆందోళన చేపట్టారు. తాము రూ.43వేల చొప్పున 61 మందిమి డీడీలు చెల్లించామన్నారు. యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొక్కు దేవేందర్‌యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేటీఆర్ నిర్లక్ష్యంతోనే యాదవులకు రెండో విడత గొర్రెలు రాలేదని ఆరోపించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి దంపతులు

రామడుగు: కరీంనగర్ జిల్లా రామడుగు మండలం దేశరాజ్‌పల్లి గ్రామ పరిధిలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల ప్రాంగణంలో మంగళవారం శ్రీశివపార్వతుల కల్యాణోత్సవం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో పాల్గొన్న అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి మాట్లాడారు. శివపార్వతుల కల్యాణం మహిమాన్వితమైందని, శుభఫలాలను అందిస్తుందన్నారు. మూడో రోజు గురవందన పర్వక, గో గణపతి, గౌరీ స్థాపిత మంటపజాదిలు, సప్తశతీ పారాయణం, నవార్ణమంత్ర జపం, అమ్మవారికి అభిషేకం, అర్చనలు, మహాన్యాసపర్వక రుద్రాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పురోహితులు, పాఠశాల, కళాశాల ల సిబ్బంది, భజన బృందాలు, భక్తులు పాల్గొన్నారు.

ఇస్రోలో టీవోగా పోరుమల్ల వాసి



శ్రావణ్

మెట్‌పల్లి: జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో జేఈగా పనిచేస్తున్న పొట్టపత్తిని శ్రావణ్‌కుమార్ భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. మేడిపల్లి మండలం పోరుమల్లకు చెందిన శ్రావణ్‌కుమార్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. ఏపీఆర్‌జేసీ రాసి రాష్ట్రస్థాయిలో 11 ర్యాంకు సాధించి నిమ్మకూర్‌లోని కళాశాలలో ఇంటర్ పూర్తిచేశారు. హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసి బీఎస్ఎన్ఎల్‌లో జేఈగా చేరారు. ఇస్రోలో శాస్త్రవేత్త కావాలన్న లక్ష్యంతో ఆ ఉద్యోగం చేస్తూనే ఖాళీ సమయంలో పుస్తకాలతో కుస్తీ పట్టారు. కొన్నినెలల క్రితం ఇస్రోకు సంబంధించి టీఓ పరీక్ష రాసి ఆల్ ఇండియా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. జేఈ ఉద్యోగానికి రాజీనామా చేసిన ఆయన.. ఈనెల 29న బెంగళూర్‌లోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో ఉద్యోగంలో చేరనున్నారు. టీఓ నుంచి శాస్త్రవేత్తగా పదోన్నతి పొందవచ్చని శ్రావణ్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.